

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన ఉత్తమ పోలీస్ అవార్డు గ్రహీత కెక్కెర్ల మధు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నరేష్‌కు మార్‌లను బుధవారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నాగారపు రమేష్ వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
గురువారం | 02 అక్టోబరు , 2025 | పేజీలు : 06

# అక్రమంగా డబ్బులు, మద్యం పంపిణీపై నిఘా

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామపంచాయతీ, జెడ్‌పిటిసి,ఎంపిటిసి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి బృందాలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీలు ఎఫ్‌ఎస్‌టి ,ఎస్‌ఎస్‌టి బృందాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి బృందాలతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా డబ్బులు, మద్యం, బహుమతులు వంటివి పంపిణీ కాకుండా గట్టి నిఘా ఉంచాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం వంటివి తీసుకు వెళ్తుంటే తక్షణమే వాటిని సీజ్ చేయడం, సీజ్ చేసిన సామాగ్రి మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయించాలని, ప్రతిరోజు నివేదికలను పంపించాలన్నారు. పట్టుకున్న నగదు, మద్యం ,తదితర సామాగ్రి అంతటిని దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో డిపాజిట్ చేయాలని చెప్పా రు. నగదు వంటివి సీజ్ చేసే సమయంలో అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని ,వైద్య పరమైన కారణాలతో ,వివాహ వేడుకలు,ఇతర వేడుకల సందర్భంగా నగదు తీసుకెళ్లే వారి విషయంలో అన్ని విషయాలు ధ్రువపరచుకొన్న తరువాతే సీజ్ చేయాలని, ఎలాంటి ఆధారాలు లేని నగదు, ఇతర సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లయితే సీజ్ చేయాలని చెప్పారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమించి పని చేసినట్లయితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బృందాలు తప్పనిసరిగా చెక్ లిస్టు కలిగి ఉండాలని ,అన్ని విషయాలను సమగ్రంగా వీడియోగ్రఫీ చేయించాలని చెప్పారు.అంతకుముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని ,ర్యాలీలు, వాహనాల అనుమతులు తప్పనిసరిగా చూడాలని, ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేసే కమిటీలు జాగ్రత్తగా వీటన్నిటిని పరిశీలించాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు ,డిపిఓ వెంకయ్య, ఇన్చార్జి డిఆర్ఓ వై .అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు,ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి బృందాలు, జోనల్ అధికారులు ,ఎంపీడీవోలు, మోడల్ కోడ్ బృందాలు హాజరయ్యారు.

# రాజకీయ పార్టీలు సహకరించాలి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో జడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ విసి హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థులు ఎన్నికల్లో ఉపయోగించే వాహనాలు, మైక్‌లు, భోజనాలు, ఫ్లెక్సీ, లేబర్ చార్జీలు, కరపత్రాలు, పోస్టర్లు, ఎల్‌ఈడి స్క్రీన్‌లు తదితరు అంశాలకు చెందిన వస్తువుల ధరల వివరాలు రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. మున్సిపాలిటిలలో ఎన్నికల కోడ్ అమలులో లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలలో కొత్తగా ఎటువంటి పథకాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, గ్రౌండింగ్ వంటివి ఉండవని తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని, అసత్య ప్రచారాన్ని ప్రసారం చేసినచో తగు చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల విషయంలో రాజకీయ నాయకులు సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఇఓ అప్పారావు, జిల్లా పంచాయితి అధికారి యాదగిరి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరయ్యారు.



# దొంగతనాన్ని 24 గంటల్లోనే ఛేదించిన సూర్యాపేట టూటౌన్ పోలీసులు..






ఇంట్లో పనిచేసే సహాయకురాలే దొంగతనానికి పాల్పడింది

మొత్తం 55లక్షల విలువైన సొత్తు రికవరీ

సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ శివతేజ, ఎస్‌ఐ సురేష్‌లకు రివార్డులు

జిల్లా ఎస్‌పి కె నరసింహ వెల్లడి

# దసరా పండుగ శుభాకాంక్షలు

## గుత్తా సుఖేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ (విజయ దశమి) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని ఆయన చెప్పారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని వివరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో దసరా పండుగ ఘనంగా జరుపుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆకాంక్షించారు.

## సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అందరిలో చెడు తొలిగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదని పేర్కొన్నారు. పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించామన్నారు. దసరా వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలని కోరారు.

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యక్రమం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. దుర్గామాత అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని అమ్మవారి కరుణాకటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభిలాషించారు.

## దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గ ప్రజలు విజయ దశమి(దసరా) పండుగను సంతోషాల నడుమ ఇంటిల్లిపాది జరుపుకోవాలని కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి సభ్యులు జాల నర్సింహారెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్ నాయక్, కిషన్‌నాయక్, బిల్యానాయక్‌లు నియోజకవర్గ ప్రజానికానికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ మోటకొండూరు** : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో ఇందిర తెలిపారు ఆమె బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలవుతున్న సందర్భంగా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా జరగకుండా టాస్కోర్స్ సిబ్బంది తనిఖీ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ ఎస్సై అశోక్, తహసిల్దార్ నాగదివ్య, ఎంపీఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితులకు సన్మానం



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో 2000 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌లో ప్రభుత్వ ఉద్యోగులలో పదోన్నతులు పొందిన స్నేహితులకు ఆబ్యాచ్ సభ్యులు గ్రామంలో ఉన్న మండలపరిషత్ ప్రాథమిక పాటశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో బండి యాదగిరి తండ్రి వెంకటేశం ఇస్రో శాస్త్రవేత్త, దామెర్ల వెంకన్న తండ్రి యాదగిరి స్కూల్ అసిస్టెంట్, బొమ్మగాని వీరెందర్ తండ్రి అంజయ్య హెడ్ కానిస్టేబుల్ ఉన్నారు. సభాఅధ్యక్షుగా బొమ్మగాని భద్రయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, 2000 బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : ఎంపీటీసీ/జడ్పిటిసి మరియు గ్రామపంచాయతీ రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కొరకు ఎంపిటిఓ, తాసిల్దార్ మరియు పోలీసు సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, తాసిల్దార్ శేషగిరిరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న మరియు ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు




**ప్రజాపక్షం/సూర్యాపేట** : దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ తరపున జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్‌పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో తేజస్సు, విజయాన్ని తేవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించుకునేవారు సంతోషకరమైన వాతావరణంలో, ఆరోగ్యకరంగా అందరూ కలిసిమెలిసి సోదరభావంతో ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలు నిర్వహించుకునే ఉత్సవానికి పటిష్ట భద్రత కల్పిస్తుంది, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. యువత ఆదర్శంగా ఉండాలని క్రీడా పోటీల విషయంలో క్రీడా స్థలం గొడవలు పెట్టుకోవద్దని కోరారు. లాటరీ, బెట్టింగ్‌లు నిర్వహించరాదని సూచించారు. జంతువులను హింసించే విధంగా పోటీలు పెట్టవద్దు, జూదం పోటీలు నిర్వహిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవులు ఉన్నందున సైబర్ మోసగాళ్ళు రెచ్చిపోయే అవకాశం ఉందని ఎవరికైనా ఉచితాలు, బహుమతులు, లోన్స్, తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభం ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు ఉన్నాయంటే నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించవద్దని, బ్యాంక్ నుండి మాట్లాడుతున్నాం ఏటిఎం, క్రెడిట్ కార్డు, ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలి అంటే ఓటిపిలు చెప్పవద్దని దీని వెనుక సైబర్ మోసగాళ్ళు ఉన్నారని గుర్తించాలన్నారు.

## ఐక్యమత్యంతో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి



**ప్రజాపక్షం/మోటకొండూరు** :కాంగ్రేస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఐక్యమత్యంతో ఉండి స్థానిక సంస్థల ఎన్నికలలలో కాంగ్రేస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలతో సత్సంబంధాలు ఉండి ప్రజల కోసం సేవ చేసి గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేసి గెలిపించాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గంగాపురం మల్లేష్ మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయానికి అందరు కట్టుబడీ ఉండాలని, ఎవరు తొందరపడవద్దని తెలిపారు. ఆశావాహులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కోంత మంది ఆశావాహులు తమతమ పేర్లు నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎఎంసి చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, డైరెక్టర్ తండ రంగయ్య, జిల్లా నాయకులు కోంతం మోహన్ రెడ్డి, వంగాల మల్లేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఇల్లందుల మల్లేష్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, సామ భూపాల్ రెడ్డి, బుగ్గ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : దేవి శరన్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మర్రిగూడ, ఎన్‌టిఆర్ కాలనీ, న్యూ వీటి కాలనీలలో ఏర్పాటుచేసిన దుర్గాభవాని మండపాలలో బుధవారం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా మండపాలలో అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు శేష వస్త్రలను అందజేసి ఆశీర్వదించారు. ఈ పూజా కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ గున్‌రెడ్డి యుగంధర్ రెడ్డి, రావుల శ్రీనివాసరెడ్డి, లొడంగి గోవర్ధన్,బొజ్జ వెంకన్న, గుండెబోయిన జంగయ్య బీపంగి కిరణ్, యాదమ్మ మాత ఉన్నారు.

**ప్రజాపక్షం/మోటకొండూరు**: మోటకొండూరు మండల కేంద్రంలో దేవీ నవ రాత్రి పూజల సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి సతి సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన మోటకొండూర్ ప్రేస్ క్లబ్‌ను సందర్శించి ప్రెస్ క్లబ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరబోయిన మల్లేష్ యాదవ్, గౌతంరాజు, వంశీదర్ రాజు, గడ్డం వెంకటేశ్ గౌడ్, కోరటికంటి శ్రీకాంత్, ప్రెస్ క్లబ్ సభ్యులు చామల మహేందర్ రెడ్డి, ఉస్మాన్, నాగరాజు, నవీన్ నరేష్, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహింపురం గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపంలోని అమ్మవారి పూజల్లో హిందూ ధర్మరక్ష ఫౌండర్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇబ్రాహింపురం గ్రామానికి విచ్చేసిన చికోటి ప్రవీణ్‌కు హనుమాన్ యూత్ సభ్యులు పటాకులు కాలుస్తూ, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ అధ్యక్షుడు బూర్గు ఉపేందర్ రెడ్డి(చిన్నప్పి), ఉపేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, మాటూరి భాను, మెందు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



## మహిళా ఉద్యోగులకు వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : పోషణ మాసంలో భాగంగా బుధవారం భారత ఆహార సంస్థ నల్లగొండ డివిజనల్ కార్యాలయం లో ఆరోగ్యవంతమైన మహిళ,శక్తివంతమైన కుటుంబం శీర్షికన అనే అంశంతో మహిళా ఉద్యోగుల కు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా కుటుంబాలు మరింత బలపడతాయని, తద్వారా సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. రివర్ నిమ్స్ ఆసుపత్రి , నుండి డాక్టర్ సౌమ్య నేతృత్వంలో వైద్యుల బృందం పలు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం ప్రాముఖ్యత, జీవనశైలి సంబంధిత సమస్యల నివారణపై సలహాలు అందించడం జరిగిందని తెలిపారు.ఈ శిబిరంలో సీనియర్ అధికారులు కలైసెల్వి, కె.ఎన్.కె. ప్రసాద్, మహిళా ఉద్యోగులు సంధ్య, స్పందన, సరిత, సునంద, భవ్య, మరియు ప్రజా సంబంధాల విభాగం ఇన్‌ఛార్జి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని బాలాజీనగర్ గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై శేఖర్ రెడ్డి బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీని పరిశీలించారు.అనంతరం గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమీక్షలో భాగంగా ఉపాధి కూలీలకు కేవైసీ చేయడంలో తక్కువ ప్రోగ్రెస్ ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించి సోమవారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా మహిళా సంఘాలకు సంబంధించి ఏపీఎంతోపాటు సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయన వెంట ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీవో శ్రీనివాస్,ఏపీఎం నాగలీల, ఈసీ దశరథ రెడ్డి తో పాటు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు,సీసీలు, ఫీల్డ్అసిస్టెంట్లు ఉన్నారు.

## ప్రతీ ఒక్కరిపై దుర్గామాత ఆశీస్సులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో పాతకబేలా వద్ద ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పెండెం చంద్రశేఖర్, పెండెం విజయ్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు స్వర్గీయ పెండెం యాదగిరి జ్ఞాపకార్థం అన్నవితరణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెండెం చంద్రశేఖర్ మాట్లాడుతూ భక్తులు తొమ్మిది రోజులపాటు దుర్గామాత అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు కోరిన కోరికలు నెరవేరాలని ఆ అమ్మవారి దయ అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముశం రవికుమార్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, గుడిపాటి వెంకటేశ్వర్లు, కొండ సంతోష్, కొండపల్లి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, గుండా లక్ష్మయ్య, పోలబోయిన నర్సయ్య యాదవ్, ఖమ్మంపాటి వేణుబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





## అమ్మవారి ప్రసాదం పంపిణీ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని ఇంటింటికి పంపిణీ చేయడం అమ్మవారు నాకు కల్పించిన అదృష్టమని బిఆర్ఎస్ జిల్లా నాయకులు మోత్కూరి సందీప్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో గొబ్బిళ్ళ కరుణాకర్, గోవిందు, వీరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డు ప్రసాదాన్ని వార్డులోని 650 కుటుంబాలకు పంపిణీ చేశారు. దాతలు, ఉత్సవ కమిటి సభ్యులు ఆమంచి లీలానగేష్, గొబ్బిళ్ళ కరుణాకర్, గోవింద్, వీరేష్, చీకూరి సాయికుమార్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

## మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నయానగర్, జ్యోతి అపార్ట్‌మెంట్ లలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను కమిటి సభ్యులు ప్రారంభించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటి సభ్యులు జుకూరి అంజయ్య, కోట తిరపతయ్య, బ్యాటరీ చారి, బాడిసె సత్యం, హనుమంతరావు, నయానగర్ ఉత్సవాల కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఆయుధ పూజ

**ప్రజాపక్షం/మోటకొండూరు** : మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో సురేష్ జి ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆయుధ పూజా కార్యక్రమం నిర్వహించారు. 100 సంవత్సరాలు దేశం కోసం హిందూ ధర్మం కోసం, సనాతన ధర్మం కోసం, సంస్కృతి సాంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుకు వచ్చినటువంటి రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పైళ్ల యాది రెడ్డి, జోరుక ఎల్లేష్, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, యెల్లంల శ్రీధర్ రెడ్డి, భూ రెడ్డి జనమేజయారెడ్డి, గుర్రాల రవి, సుల్తాన్ మహేందర్, గుర్రాల కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలి

**ప్రజాపక్షం/మునగాల:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని, ఆరు గ్యారెంటీల మోసాన్ని కార్యకర్తలు ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. 420 హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో బిఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని, గులాబీ జెండాలను ఎగురవేయాలని కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ నియోజకవర్గంలో ప్రజలే నా బిడ్డలని ప్రగల్భాలు పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రజలకు 22 నెలల కాలంలో చేసిందేమిలేదన్నారు. రాష్ట్రంలో



పాలన గాలికి వదిలేసి మంత్రులు హెలికాప్టర్లలో ప్రయాణాలు చేసి ప్రజలను విస్మరించారని అన్నారు. రాష్ట్రంలో రైతులను కార్మికులను ప్రతి ఒక్క రంగాన్ని విస్మరించి కాంట్రాక్టర్లు కమిషన్ల పేరుతో పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతరాములు, వల్లపురెడ్డి రామిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కోలా ఉపేందర్‌రావు, నాగిరెడ్డి, ఇంద్రశేఖర్‌రెడ్డి, బాలాజీ, రాణి, కృష్ణ, ఎల్‌పి రామయ్య పాల్గొన్నారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు







**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్తానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు ఎలాంటి అడ్డంకులు కలుగకుండా చూడాలని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం ఆయన అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో ఎవరి జనాభా దామాషా ప్రకారం వారు రిజర్వేషన్లు అనుభవిస్తున్నప్పుడు 60శాతం ఉన్న బీసీలు కేవలం 42శాతం మాత్రమే అడుగుతున్నారని, దానికి కూడా అభ్యంతరం చెప్పడం సరికాదన్నారు. అదేవిధంగా ఆయన దసరా పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

**దేవి శరన్నవరాత్రిలో భాగంగా చండీ హోమం**

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామంలో శరన్నవరాత్రిలో భాగంగా కొలువుదీరిన దుర్గ మాత వద్ద బుధవారం ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. పురోహితులు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు బాగా పండి ప్రజలు అభివృద్ది చెందాలని, పనులలో ఆటంకాలు తొలగి విజయాలు చేకూరాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండి, కరువు కాటకాలు లేకుండా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటి అధ్యక్షులు నత్తి సైదులు, ప్రధాన కార్యదర్శి కందుకూరి చందు, లక్ష్మ ణ్, బాబు, సతీష్ భక్తులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ సన్నిధి లో అన్న ప్రసాద వితరణ**

**ప్రజాపక్షం/నల్లగొండ (శాలిగౌరారం):** మండల వ్యాప్తంగా కనకదుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.మండల పరిధిలో ని అడ్లూరు గ్రామం లో శ్రీశ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు 15 వ వార్షికోత్సవం సందర్భంగా అన్న ప్రసాద దాతలు మేకల బిందు శ్రీధర్ రెడ్డి,కట్టా లక్ష్మీ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల కు అన్నప్రసాధ వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ గా హాజరై దుర్గాదేవి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమం లో యంగ్ స్టార్ యూత్ సభ్యులు,దుర్గా దేవి కమిటీ సభ్యులు,భక్తులు,అడ్లూరు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ రామన్నపేట:** దసరా పండుగ సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తులు నవరాత్రుల పాటు అమ్మవారిని ఆయా అవతారాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బట్టె సంతోష్‌కుమార్, దావనూరి చింటూ, బాలగోని కల్యాణ్, ప్రవీణ్‌కుమార్, రాజు, యశ్వంత్, భవాని తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం ) :** మండల కేంద్రంలోనీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పదవ రోజు అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దినిగా దర్శనం ఇచ్చారు. ఆలయ దర్మకర్త లు ఏనుగు సుగంధిని సురేందర్ రెడ్డి దంపతులు చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు లోడి శంకర్ రోహిణి, బీసు ధనలక్ష్మి , మనోహర్ లాల్, ఎద్దు మత్యగిరి, కోల లక్ష్మ య్య, విశాల్ సూర్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి** :మండల కేంద్రంలోని జై భవాని యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిఆర్వో ఆదిమూలం సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గామాత ప్రతిష్ట నిర్వహకులు సురేష్‌ను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సాయిరాం, సాయికిరణ్, కలాషికం బాలు, గణేష్, కార్తీక్ తదితరులు ఉన్నారు.



## దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : విజయదశమి దసరా పండుగ పురస్కరించుకొని బుధవారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో అమ్మ వారి, వాహన పూజ, ఆయుధ పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో యదాద్రి డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట రూరల్ సిఐ శంకర్ గౌడ్, స్థానిక ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోశాలతో ఉండాలని, దసరా పండుగను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శివ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## హిమగిరికి నివాళులు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** నల్లగొండ జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎరుకల హిమగిరి పెద్దకర్మ కార్యక్రమం చండూరు మండల కేంద్రలో ఏర్పాటు చేశారు.మర్రిగూడ మాజీ ఎంపిపి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ పాల్గొని చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు.వారితోపాటు కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## చాందీ మృతి బాధాకరం




**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని ఎర్రగుంటతండాకు చెందిన రామావత్ చాందీ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్,జిల్లా అధ్యక్షుడు రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం చాంది మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అదేవిధంగా చాంది ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండలంలోని కొరటికల్ గ్రామం మధిర ఇప్పల్ల గ్రామంలో పంజాల యాదయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి ఎల్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లగ్గాల శోభ పురుషోత్తం గౌడ్ సహకారంతో 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో లగ్గాల నరహరి, తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య, పెండెం పురుషోత్తం, సోలిపురం రామ్ రెడ్డి, పెద్ది లక్ష్మ య్య, బెజ్జరబోయిన లక్ష్మ ణ్, రాగటి పరశురాములు, రాగటి స్వామి, రంగు వెంకటేశ్, కోల నరేష్, బొంత విగ్నేష్, చామకూర నరేష్, చిన్నం మధు, చిన్నం వీరస్వామి, వెలిమినేటి నరేష్, బండ మహేష్, చామకూర సాయి, గజ్జెల్లి వినయ్, లగ్గాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలి




**-20 రోజుల్లో పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి**
**-రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పెండింగ్ రైస్ డెలివరీపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మంజిల్లా నుంచి గత ఖరీఫ్ సీజన్ పెండింగ్ ఉన్న 11,500 మెట్రిక్ టన్నులు రా రైస్, బాయిల్డ్ రైస్ 3500 మెట్రిక్ టన్నులు రాబోయే 20 రోజుల పని దినాలలో ఎఫ్‌సిఐకు రైస్ మిల్లర్లు సరఫరా చేయాలన్నారు. రైస్ మిల్లర్లు రైస్ సరఫరా చేసేందుకు వీలుగా ఎఫ్‌సిఐ అధికారులు గోదాముల్లో స్పేస్ అందుబాటులో పెట్టాలని, గోదాములకు కనీస అప్రోచ్ రోడ్డు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి గత రబీ సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న 42వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీకు రోజుకు 600 మెట్రిక్ టన్నులే సరఫరా దాటడం లేదని దీనికి కారణాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రవాణా ఛార్జీలకు సంబంధించిన బిల్లులు రైస్ మిల్లర్లు శనివారం నాటికి అందిస్తే ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. రైస్ మిల్లర్లు తమ పూర్తి సామర్థ్యం మేరకు మిల్లింగ్ నిర్వహించి నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. మిల్లర్ల దగ్గర ఉన్న నాణ్యమైన గన్ని సంచులను తీసుకునేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైస్ మిల్లర్ల సమస్యలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎఫ్‌సిఐ అధికారులు, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోనకల్ మండలంలో ఖరారైన రిజర్వేషన్లు




**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో గ్రామపంచాయతీ రిజర్వేషన్లు అధికారులు ప్రకటించారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అదేవిధంగా 22 గ్రామపంచాయతీలోను వార్డుల వారీగా కూడా రిజర్వేషన్లు ప్రకటించారు. మండల కేంద్రమైన బోనకల్ గ్రామ పంచాయతీ బిసి మహిళకు రిజర్వ్ అయింది. ఆళ్లపాడు గ్రామపంచాయతీ జనరల్ మహిళకు, బ్రాహ్మణపల్లి బిసి మహిళకు, చిన్నబీరవల్లి బిసి జనరల్‌కు, రిజర్వ్ అయ్యాయి. చిరునోముల బిసి జనరల్‌కు, చొప్పకట్లపాలెం బిసి మహిళకు, గార్లపాడు జనరల్‌కు, గోవిందాపురం(ఎ) ఎస్సీ మహిళకు, గోవిందాపురం(ఎల్) ఎస్సీ మహిళకు, జానకిపురం బిసి జనరల్‌కు, కలకోట జనరల్‌కు రిజర్వ్ అయ్యాయి. లక్ష్మీ పురం ఎస్సీ జనరల్‌కు, మోటమర్రి ఎస్సీ జనరల్‌కు, ముష్టికుంట్ల జనరల్‌కు, నారాయణపురం ఎస్సీ జనరల్‌కు, పెద్దబీరవల్లి బిసి జనరల్‌కు, రామాపురం బిసి మహిళకు, రాపల్లి ఎస్సీ మహిళ, రావినూతల ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయ్యాయి. రాయన్నపేట బిసి జనరల్‌కు, సీతానగరం ఎస్సీ జనరల్‌కు, తూటికుంట్ల జనరల్‌కు రిజర్వ్ చేశారు. మండలంలో మొత్తం 22 గ్రామపంచాయతీలకు గాను బిసి మహిళకు 4, బిసి జనరల్‌కు 5, జనరల్ మహిళకు 1, జనరల్‌కు 4, ఎస్సీ జనరల్‌కు 4, ఎస్సీ మహిళకు 3, ఎస్టీ జనరల్‌కు ఒకటి రిజర్వ్ అయ్యాయి. మండలంలో గ్రామపంచాయతీల రిజర్వేషన్లు ప్రకటించటంతో ఎన్నికల వాతావరణం ఊపందుకుంది. అధికార, ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నుండి పలువురు నాయకులు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# నాగభూషణం, వెంకటనర్సమ్మల సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/ బోనకల్ :** సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి బుంగా నాగభూషణం, ఆళ్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకురాలు బుంగ వెంకటనర్సమ్మల సేవలు మరువలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో బుంగ నాగభూషణం ప్రథమ వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నాగభూషణం, వెంకటనర్సమ్మ చిత్రపటాలకు ఆయనతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి జమ్ములు జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, పావులూరి ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి కృషి చేసిన వారిలో వీరి పాత్ర మరువలేనిదన్నారు. నాగభూషణం నేతృత్వంలో ఆళ్లపాడులో నిరుపేదలకు భూపంపిణీలో కీలక భూమిక పోషించారన్నారు. ఆళ్లపాడు గ్రామ సర్పంచ్‌గా బుంగా వెంకటనర్సమ్మ గ్రామాభివృద్ధికి విశేష కృషిచేశారని, ఆళ్లపాడు వాగుపై వంతెన నిర్మాణం, రహదారుల అభివృద్ధిలో కీలక భూమిక పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సిపిఎం మండల కార్యదర్శి కిలారి సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, టిడిపి మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీను, వంగా నర్సింహ, తోటపల్లి ఆనందరావు, ఏలూరి రమేష్, గ్రామశాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, గుడిదే కృష్ణ, గుంపుల జయరాజు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రేచర్ల యూత్ ఆధ్వర్యంలో గంగారావుకి సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బొర్రా గంగారావును కలిసి రేచర్ల యూత్ మెంబర్స్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేచర్ల సైదులు, రేచర్ల వెంకటేష్, రేచర్ల సతీష్‌బాబు, రేచర్ల వెంకటేశ్వరరావు, రేచర్ల శ్రీకాంత్, రేచర్ల నవీన్, రేచర్ల తేజ, తోట సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల దసరా శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజయ దశమి సందర్భంగా తెలుగు ప్రజలకు బుధవారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా చేసుకునే ఈ దసరా పండుగను తెలుగు ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు విజయం, ఐశ్వర్యం కలగాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**-పువ్వాళ్ల దుర్గాప్రసాద్**


**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రఘునాథపాలెం మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ఇంటింటా ప్రచారం చేపట్టాలన్నారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి ప్రతి ఒక్కరూ సహకరించి గెలిపించాలన్నారు. ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలకు అనుగుణంగా పార్టీ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో సమన్వయంతో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఏకగ్రీవాలపై ఎక్కువగా దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సయ్యద్ మియాజాని భవన్ నందు మండల కార్యదర్శి వగ్గెల అర్జున్‌రావు అధ్యక్షతన సిపిఐ మండల, పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సిపిఐ తన మార్కును చూపించాలని, ఇప్పటి నుండే కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి వీలైనన్ని సర్పంచ్, ఎంపిటిసి స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు. మండలంలో 8 పంచాయతీలు, 4 ఎంపిటిసి స్థానాల్లో సిపిఐ పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపాల్టీ ఎన్నికలు కూడా ఎంతో సమయం లేదని, పట్టణంలో ఉన్న సిపిఐ నాయకులు కార్యకర్తలు ఇప్పటి నుండే కష్టపడి పనిచేసి ఎన్నికల్లో వీలైనన్ని కౌన్సిలర్ స్థానాల్లో పోటీ చేసే సిపిఐ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజల కోసం సిపిఐ చేసిన ఉద్యమాలు, పోరాటాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శి వగ్గెల అర్జున్‌రావు, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, మండల, పట్టణ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి



**-నిబంధనల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి**
**-మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్**
**-నోడల్, రిటర్నింగ్ అధికారులకు అవగాహన కార్యక్రమం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తెలిపారు. బుధవారం డిపిఆర్‌సి భవనంలో నోడల్ అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు వారి పరిధిలో గల విధులు, హక్కులు, నిబంధనల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన హ్యాండ్ బుక్ ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని ముఖ్యమైన నిబంధనలు మార్క్ చేసుకుని పెట్టుకోవాలన్నారు. మనకు కేటాయించిన హ్యాండ్‌బుక్ మనకు భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాంటిదని అందులని నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణ స్క్రూటిని ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/సుజాతనగర్:** గాంధీ జయంతి రోజున చికెన్, మటన్, చేపలు విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమీషనర్ సుజాత తెలిపారు. బుధవారం సుజాతనగర్ మండల కేంద్రంలో చికెన్ మాంసం దుకాణాలలో కార్పొరేషన్ సిబ్బంది మాంసం విక్రయించరాదని దుకాణదారులకు తెలియజేస్తూ నోటీసులు అందించారు. తెలంగాణలో అతి పెద్ద పండుగ దసరా పండుగ కావడంతో చాలామంది చుక్కా ముక్కతోనే సరదాగా గడుపుతారు. ఇలాంటి సందర్భాలలో దసరా పండగ గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో చాలామంది ఆనందానికి దూరమౌతుందన్నారు.

# రాజేశ్వరి ఆశయసాధనకు కృషి చేయాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాచలం :** మారెడ్డి రాజేశ్వరి ఆశయాల సాధనకోసం పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ సతీమణి రాజేశ్వరి ప్రథమ వర్ధంతి సభ వారి స్వగృహమందు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావుతో కలిసి హాజరైన పాషా రాజేశ్వరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ మావన జీవ పరిణామ క్రమంలో పుట్టిన జీవి మరణించక తప్పదని, జీవించి ఉన్న వారు మృతి చెందిన వారి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ వారి ఆశయాల సాధన కోసం అనునిత్యం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల భాస్కర్ రావు, ఎస్‌వీఎస్ నాయుడు, వంకా మహేష్, ఏఐటియూసీ పట్టణ కార్యదర్శి కంభమెట్టు శ్రీనివాస్, సీతా రామ రాజు, బొల్లోజు వేణు, గుంజా రామారావు పాల్గొన్నారు.

# ఆది కర్మయోగి అభియాన్ విజయవంతానికి కృషి



**- ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని మండలాల్లో ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నట్లు ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ చెప్పారు. సెక్రెటరీ ఆఫ్ మోటా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూ ఢిల్లీ నిమిస్టరీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫైర్స్ నిబునాయర్ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో/టెలీకాన్ఫిరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా ఐటిడిఏ పరిధిలోని 19 మండలాల్లో గల 130 గ్రామ పంచాయితీల్లో గ్రామకార్యచరణ ప్రణాళికలు రూపొందించి పోర్టల్ లో కార్యాచరణ ప్రణాళిక పోర్టల్‌లో పొందుపరిచామని చెప్పారు. విలేజ్ నోడల్ ఆఫీసర్లు, బీఎంటీలు, సాతి సహాయోగులను నయమించిడం జరిగిందని, వీరి ద్వారా ప్రతిగామ పంచాయితీలో ఆదిసేవ కేంద్రాలు ప్రారంభించామని, 130 పంచాయితీలలో ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, సిబ్బంది కార్తీక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనేతరులకు కేటాయించిన రిజర్వేషన్ తక్షణమే నిలిపేయాలి

**- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక**



**ప్రజాపక్షం/భద్రాచలం :** 5 షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు కేటాయించిన రిజర్వేషన్ నిలిపివేయాలని, ఆదివాసీ భూభాగంలో జడ్పీటీసీ,ఎంపీటీసీ రిజర్వేషన్లను గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు దొర బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజనేతర రిజర్వేషన్లను 5వ షెడ్యూల్ ప్రాంతంలో మినహాయించుకోవాలన్నారు. అధిక ఆదివాసీ భూ భాగం కలిగిన భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీమ్ జిల్లాలో జిల్లా పరిషత్ స్థానాలు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా ఆమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ది చెప్పడానికి ఆదివాసీ సమాజం సిద్దంగా ఉందన్నారు.

# క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**-ఏసిపి రమణమూర్తి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమయపాలన, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఖమ్మం ఏసిపి ఎస్‌వి రమణమూర్తి తెలిపారు. డోర్నకల్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చెరుకుపల్లి విశాలి తన విద్యకు చేయూతనందించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్యను అభ్యర్థించింది. ఇంజనీరింగ్ చదువుతున్న విశాలికి చేయూతనిచ్చేందుకు గాను పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు తరుపున రూ. 20వేల చెక్కును బుధవారం ఏసిపి రమణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ముందుకు సాగాలని తెలిపారు. లక్ష్య సాధనకు చేరుకున్న తర్వాత తన వంతు సేవాగుణం అలవర్చుకోవాలని విశాలికి సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ కెజి పుష్పవల్లి, విద్యార్థిని తల్లి చెరుకుపల్లి స్వరూప, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# షటిల్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం

**క్రీడలను ప్రోత్సహిస్తాం : డాక్టర్ కాపా మురళీకృష్ణ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయదశమి పురస్కరించుకొని షటిల్ టోర్నమెంట్ పోటీలను చిన్నారులకు నిర్వహించారు. వైరాలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకోవాలని నేటి ఓటమి రేపటి గెలుపుకు బాట అని అన్నారు. చాలా అద్భుతంగా ఆట ఆడారని పిల్లలకు మంచి భవిష్యత్తు ఉందని, ఈ షటిల్ పోటీలు ద్వారా వ్యక్తమైందని ఆయన అన్నారు. ఇప్పటికే కొంతమంది చిన్నారులు రాష్ట్రస్థాయిలో షటిల్ పోటీల్లో సెలెక్ట్ అయి ఉన్నారని తెలిపారు. మంగళశారం నిర్వహించిన షటిల్ పోటీల్లో మధిర, కల్లూరు, వైరాకు చెందిన చిన్నారులు షటిల్ పోటీలు విజేతలుగా నిలిచారు. షటిల్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులను కాపా మురళీకృష్ణ అభినందించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మెడల్స్‌ను షీల్డ్‌లను ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జిల్లా విజన్ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి గద్దె నీరజ, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాల పుల్లారావు, సెక్రటరీ గంగవరపు కిషన్‌రాయి, కోశాధికారి ఉయ్యూరి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు తోటకూర శ్రీకాంత్, ఎలెసిఐఎఫ్ కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు, షటిల్ పోటీలు నిర్వహించిన కోచ్ షేక్ అంజద్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని లడకబజార్ నందు శ్రీ దేవీ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు కురువెళ్ళ వెంకటపురషోత్తమ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ మహాఅన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల నర్సింహామూర్తి, కుంచం కృష్ణారావు, కొల్లా శ్రీనివాసరావు, చలువాది కృష్ణమూర్తిలను కమిటీ వారు అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పిండి నాగరాజు, గుండెమెడ బాలాజీ, కృష్ణయ్య, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎంఎ ఖరీం అకాల మృతి పట్ల సంతాపం



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని ఖాజీపురం మాజీ సర్పంచ్, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం సోదరుడు ఎంఎ కరీం బుధవారం ఉదయం అకాల మృతి చెందారు. ఈ మృతి వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, టిడిపి జిల్లా నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, మల్లారం శాఖ కార్యదర్శి పరుచూరి రాము, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

# మాంసం విక్రయాలు నిషేధం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ, సారపాక గ్రామ పంచాయితీలలో నేడు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసం అమ్మవద్దు అని బుధవారం ఆయా గ్రామ పంచాయితీ ఈవోలు బర్ల ప్రభాకర్, మహేష్‌లు నోటీసులు జారీ చేశారు. గాంధీ జయంతిని ముందు రోజు నోటీసులు జారీ చేయటం పట్ల పలువురు ప్రజా సంఘాలు, జాతీయ వాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల బిఆర్‌ఎస్ మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల స్థానిక సంస్థల ఎన్నికల కమిటీని బుధవారం నియామించారు. మండల స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ అధ్యక్షుడిగా నల్లమోతు వెంకటనారాయణ, కార్యదర్శి గా సంగొండి రాఘవులుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు సూచనలతో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు నియమించారు. ఈసందర్భంగ వారు మాట్లాడుతూ పార్టీ గెలుపుకు కృషి చేస్తామని, కార్యకర్తలందరూ బిఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీ, జెడ్‌పిటిసి, సర్పంచులు, వార్డులను అత్యధిక గెలుపొందేందుకు సైనికులా పని చేయాలని కోరారు.

# వైరా ఏసిపి దంపతులకు ఘన సన్మానం



**ప్రజాపక్షిం/వైరా:** వైరాలోని కమ్మవారి కళ్యాణ మండపంలో వైరా ఏసిపి ఎంఎ రెహమాన్ పదవీవిరమణ సభను బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డిసిపి జి.ప్రసాదరావు, అడిషనల్ డిసిపి అడ్మిన్ బి.రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి ఎంఎ రెహమాన్, ఫర్జానా దంపతులను శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సైగా 1991లో నియామకమైన నాటి నుండి డీఎస్పీ స్థాయి వరకు విధి నిర్వహణ పరమావధిగా విధులు నిర్వహించారని, పోలీస్‌శాఖకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు సేవలందించారని ఆయన ఎందరికో ఆదర్శప్రాయుడని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిటీ క్రైమ్ రికార్డ్ బ్యూరో ఏసిపి యు.సాగ్రాజ్, సిపిఎస్ ఏసిపి సర్వర్, కల్లూరు ఏసిపి ఏ.రఘు, ఖమ్మం డివిజన్ సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఎన్నికలు జరిగితే జెడ్పి పీఠంపై గురి..!



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న మీమాంస పక్కన పెడితే ఖమ్మం జెడ్పి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ చకచకా పావులు కదుపుతుంది. ముగ్గురు మంత్రులు, ఇద్దరు శాసన సభ్యులు ఉన్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మూడు నియోజక వర్గాల్లో మాత్రమే ఎస్టిలకు జెడ్పిటిసి స్థానాన్ని కేటాయించబడ్డాయి. జనరల్ కేటగిరిలో ఉన్న కామేపల్లి నుంచి కూడా ఎస్టి అభ్యర్థే రంగంలోకి దిగుతారన్న ప్రచారం జరుగుతుంది. ఎస్టిలకు రిజర్వు అయిన జెడ్పి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార పార్టీకి సంబంధించిన ఇద్దరు ప్రధాన నేతలు తమ అనుయయులను రంగంలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకరు వైరా నియోజక వర్గాన్ని ఎంచుకుంటే మరొకరు పాలేరు నియోజక వర్గాన్ని ఎంచుకున్నారు. ఖమ్మం జిల్లాలో 20 జెడ్పిటిసి స్థానాలకు గాను కూసుమంచి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, సత్తుపల్లి స్థానాలు ఎస్టిలకు రిజర్వు కాగా ఇందులో సత్తుపల్లి, తిరుమలాయపాలెం ఎస్టి మహిళలకు కేటాయించబడ్డాయి. తిరుమలాయపాలెం స్థానం నుంచి తన అనుచరురాలిని రంగంలోకి దింపి తద్వారా జెడ్పి పీఠంపై తన మనిషిని కూర్చోపెట్టాలని ఒక మంత్రి ప్రయత్నిస్తున్నాడు. ఇక్కడ కొంత స్థానిక స్థానికేతర సమస్య వచ్చినా మంత్రికి ఆ మండలం పైన, ఆ నియోజక వర్గంపైన గట్టి పట్టుండడంతో ఒకరిద్దరి వ్యతిరేకత చర్చనీయాంశం కాదన్న వాదన బలంగా వినపడుతుంది. ఇక మరో మంత్రి 2023 శాసన సభ ఎన్నికల కంటే ముందు నుంచే తన మనిషిగా ముద్ర వేయించుకున్న వ్యక్తిని కొణిజర్ల నుంచి బరిలోకి దింపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఖమ్మం, మధిర స్థానాలకు సంబంధించి ఎస్టి అభ్యర్థులకు ఎక్కడ జెడ్పిటిసి స్థానాలు రిజర్వు చేయబడలేదు. కొణిజర్ల నుంచి గెలిచే వారికి కానీ లేదా తిరుమలాయపాలెం నుంచి గెలిచే వారికి కానీ జెడ్పి స్థానం దక్కే అవకాశం ఉందని ప్రస్తుతం కాంగ్రెస్‌లో చర్చ సాగుతుంది. ఎవరి మాట నెగ్గితే వారి అభ్యర్థి ఛైర్మన్ అవుతారు. అది కూడా కాంగ్రెస్ మెజార్టీ స్థానాలను సంపాదించగలిగినప్పుడు మాత్రమే. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఉన్న సానుకూలత, సంక్షేమ పథకాలు ప్రజలతో ఉన్న సత్సంబంధాలు మంచి ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నారు. ప్రధాన విపక్షం బిఆర్ఎస్‌లో ఉలుకు పలుకు లేదు. కొద్ది రోజుల క్రితం ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని రఘునాథపాలెం మండల సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఎన్నికలను గట్టిగానే ఎదుర్కొవాలని నిర్ణయించారు. మిగిలిన నియోజక వర్గాల్లో ఈ జిల్లాల్లో ఎక్కడ సందడి లేదు. వామపక్షాలు తమ బలానికి తగిన రీతిలో పోటీ చేయాలని నిర్ణయించాయి. కోర్టు తీర్పు కంటే ముందే కార్యకర్తలను సన్నద్ధం చేసే పనిలో ఉన్నాయి. బిజెపి హడావుడి చేసినా చేయకపోయినా ఇక్కడ వనగూరేది ఏమి లేదు.

### భద్రాద్రి కొత్తగూడెం...

భద్రాద్రి కొత్తగూడెం రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఐదు శాసన సభ స్థానాలు ఉంటే అందులో నాలుగు ఎస్టిలకు రిజర్వు చేయబడిన ఈ నియోజక వర్గంలో జెడ్పి స్థానం మాత్రం జనరల్ అయింది. మెజార్టీ జెడ్పిటిసి స్థానాలు ఎస్టిలకే రిజర్వు చేయబడ్డాయి. రిజర్వేషన్ లాటరీ కావడంతో 20లో నాలుగు కేటాయించిన ఖమ్మం జెడ్పి ఎస్టిలకు రిజర్వు కాగా నాలుగు జనరల్ స్థానాలు ఉన్న కొత్తగూడెం జెడ్పిటిసి జనరల్ అయింది. కోర్టు తీర్పు తర్వాత ఎన్నికలు జరిగే అవకాశం లేదని ఇప్పుడే హడావుడి ఎందుకన్న భావనలో చాలా మంది ఉన్నారు. కొందరైతే జరిగే అవకాశమే లేదని తేల్చి పాడేస్తున్నారు. ఏమి జరుగుతుందో చూడాలి మరీ. అంత సానుకూలత వస్తే పోటీ రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

# తీరు మారిన బతుకమ్మ

## రాజకీయాలకు వేదికలవుతున్న బతుకమ్మ పందిళ్లు









**ప్రజాపక్షం/ఖమ్మం :** బతుకమ్మ తీరు మారుతుంది. అసలు బతుకమ్మ ఎలా మొదలైంది, ఎందుకు మొదలైంది, ఇప్పుడు ఏమి జరుగుతుందని ఆలోచిస్తే ప్రస్తుత బతుకమ్మలు రాజకీయ ప్రచారాలకు, బల ప్రదర్శనలకు వేదికలవుతున్నాయి. సామాన్యుల బతుకమ్మ, బహుజన బతుకమ్మ ఇప్పుడు కనుమరుగవుతుంది. స్థానిక ఎన్నికల ముంగిట బతుకమ్మ రావడంతో ఇప్పుడు ఈ బతుకమ్మకు మరింత ప్రాచుర్యం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను భాద్రపదమాసం అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు ఈ బతుమ్మను జరుపుకుంటారు. తొమ్మిది రోజులు జరుపుకునే ఈ బతుకమ్మను ఒక్కొక్క రోజు ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. పురాణ కథలు ఎన్ని ఉన్న తెలంగాణలో బతుకమ్మకు ఒక ప్రత్యేకత ఉంది. తెలంగాణలో వెలివాడల సంస్కృతి నడుస్తున్న నాడు, దేవాలయాల్లోకి అందరికి ప్రవేశం లేని నాడు అదో జగత్ వర్గాలకు చెందిన ప్రజలు ప్రకృతిని ప్రేమించే వారు. తొలుత రాళ్లను తమ పొలాల్లో నిలబెట్టుకుని వాటిని ఆకులతో అలంకరించి పసుపు, కుంకుమలు వేసి ప్రత్యేక పూజలు చేసేవారు. ఎక్కువగా అప్పట్లో దేవాలయాలకు ప్రవేశం లేని వారంతా ప్రకృతిలో దొరికే పూలను, ఆకులను పేర్చి ప్రత్యేక పూజలు చేస్తూ ప్రకృతినే స్మరిస్తూ పూజలు నిర్వహించే వారు. ప్రకృతిలోని నీటిని కూడా అప్పట్లో అదే రీతిలో పూజించే వారు. గంగమ్మతల్లి అంటూ సాగిలపడే వారు. ఈ బతుకమ్మలను తమకు బతుకునిచ్చిన గంగమ్మకు సమర్పించే వారు. అటువంటి ప్రకృతి పండుగ ఇప్పుడు రాజకీయ పండుగగా మారింది. ఒక్కో పార్టీ ఒక్కో చోట అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. సామాన్యుల కంటే ఇప్పుడు బతుకమ్మ ఆటలలో తళుకు బెళుకులే ఎక్కువగా ఉంటున్నాయి. ఏది ఏమైనా బతుకమ్మ ఆటలో రాజకీయ జెండాలు కనపడుతుండటం కూడా బాధాకరమే. మొత్తంగా బతుకమ్మ తన రూపును మార్చుకోకపోయినా తెర వెనక అజెండాను మాత్రం మార్చగలిగింది. ఈ రూపంలోనైనా ప్రకృతిని కొలుస్తుండటం సంతోషించదగిన విషయం. దేవుడికే రాజకీయలు అంటకట్టి మతాన్ని ప్రచారానికి వాడుకుంటున్న రోజుల్లో ఈ రాజకీయ బతుకమ్మలాట అంత పెద్ద చర్చకాకపోవచ్చు.

## అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సహకరించండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు సంగరేణి సంస్థ ద్వారా సహకరించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్‌ను కలిసి కోరారు. మంగళవారం రాత్రి సంస్థ ప్రధాన కార్యాలయంలో సి అండ్ ఎండిని కలిసి పుల ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఆర్టిసి బస్టాండ్ నూతన భవనాలకు సంస్థ ద్వారా నిధులు మంజూరు చేయాలన్నారు. సిఎస్ఆర్ స్కీం ఫండ్ సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయాలని కోరినట్లు కూనంనేని తెలిపారు. పోస్టాఫీస్ సెంటర్ నుండి డిఎస్‌పి ఆఫీస్ మీదుగా హేమచంద్రాపురం గ్రామం వరకు ఉన్న రోడ్డు సింగరేణి సంస్థ భారీ వాహనాలు రాకపోకల ద్వారా శిథిలమైందని, దీనిని సింగరేణి యాజమాన్యమే పునఃనిర్మించి ప్రజలకు ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని నివారించాలని కోరినట్లు చెప్పారు. సింగరేణి కార్మిక వాడలు, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు యాజమాన్యం చొరవ చూపాలని, రుద్రంపూర్, రామవరం తదితర ప్రాంతాల్లో మాజీ కార్మికులు నివశిస్తున్న క్వార్టర్లను వారికే స్వాదీనం చేసి విద్యుత్,తాగునీరు వసతి కల్పించాలని కోరినట్లు చెప్పారు. కార్మిక వాడల్లో శిథిలమైన రోడ్లను నిర్మించాలని, నూతన భూగర్భ గనుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని, తన ప్రతిపాదనపై అధికారి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కూనంనేని వెంట సిపిఐ, ఏఐటియూసీ నాయకులు ఎస్‌కే సాబీర్ పాషా, వంగ వెంకట్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతికి ప్రతీకలు

### -నర్సింహాస్వామి గుడి వద్ద అన్నదానాన్ని ప్రారంభించిన ఏసిపి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పండుగలు శాంతికి, సామరస్యానికి ప్రతీకలని నగర ఏసిపి ఎస్‌వి రమణమూర్తి తెలిపారు. స్థానిక నర్సింహాస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను మంచి వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా గొప్ప తృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివరెడ్డి, నాయకులు సైదా, జ్వాలా నర్సింహారావు, సతీష్‌రెడ్డి, అక్బర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

### -ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
### -జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రవిబాబు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులలో లేకుండా చూడాలని జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రవిబాబు ఆదేశించారు. మండలం లోని కొత్తకొత్తూరు, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం లో ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అదే విధంగా కొత్తకొత్తూరు లోని ప్రవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెటిరియల్ డ్రిస్ట్రిబ్యూషన్ కేంద్రం ను పరిశీలించారు. పోలింగ్ బాక్సులు, ఇతరత్రా మెటిరియల్ పంపిణీ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాలలోఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు తగిన సిబ్బందికి శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేసే వారి పట్ల చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.